డేంజర్.. యమ డేంజర్!

ప్రమాదభరితంగా రహదారులు
- పెద్ద గోతులతో అధ్వానంగా..
- పట్టించుకోని అధికారులు


పెద్దపోచారం వద్ద కోతకు గురైన రోడ్డు

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల నడుమ రహదారులు దెబ్బతిని ప్రమాదభరితంగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడటమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. పాలేరు నుంచి బంగ్లా వెళ్లే రోడ్డులో పాలేరు–నర్సింహులగూడెం గ్రామాల నడుమ రహదారి దెబ్బతిని పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారిలో పాఠశాలల బస్సులతో పాటు కూలీల ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు గుంతల్లో వెళ్లి అదుపుతప్పి పడిపోతూ గాయాల పాలవుతున్నారు.

భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం

పాలేరు నుంచి నర్సింహుల గ్రామం వరకు ఉన్న రహదారిపై మట్టి లోడుతో లారీలు తిరుగుతుండటంతో రహదారి ధ్వంసం అవుతోంది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారిలో వాహనదారులే కాకుండా రైతులు నిత్యం తమ పొలాల వద్దకు వెళ్లి వస్తుంటారు. పగలు అయితే ఎలాగోలా వెళ్తామని, రాత్రిళ్లు ఎక్కడ గుంత ఉందో అర్థం కాక రహదారిపై తమకు ప్రమాదాలు జరుగుతాయోనని భయాందోళనలు చెందుతున్నారు. గుంతల్లో కనీసం మట్టిని నింపి పూడ్చాలని కోరుతున్నారు.

పోచారంలో రహదారి కోత..

మండలంలోని పెద్దపోచారం గ్రామం ముందు చెరువు వద్ద రహదారి కోతకు గురికాగా అక్కడ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇలా పలు గ్రామాల్లో రహదారులు అక్కడక్కడ దెబ్బతిన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.



పాలేరు-నర్సింహులగూడెం రహదారిలో గుంతలు

మరమ్మతులు చేపట్టాలి

పాలేరు నుండి నర్సింహులగూడెం వరకు ఉన్న రోడ్డు బాగా దెబ్బతింది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాటిల్లో వాహనాలు పడిపోతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతలు పూడ్చి వేయాలి.

– బోయిన కృష్ణ, నర్సింహులగూడెం

త్వరలోనే చేపడతాం

పాలేరు –బంగ్లా రహదారిపై ఏర్పడ్డ గుంతలను త్వరలోనే పూడ్చివేయిస్తాం. రహదారి మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలను పంపించాం. కొద్ది రోజుల్లోనే ఈపనులను చేపట్టి ప్రమాదాలకు అవకాశం లేకుండా చేస్తాం.

– దేవేందర్, ఆర్అండ్‌బీ ఏఈ

క్లుప్తంగా

పుస్తక ముద్రణకు చేయూత


చెక్కు అందజేస్తున్న మధు, వెంకటేశ్వర్లు

ఖమ్మంఅర్బన్: నగరంలోని రిక్కాబజార్ జీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు సయ్యద్ షఫీ జిల్లా స్థాయిలో కథల సంకలనాన్ని వెలువరుస్తున్నారు. ఈ పుస్తక ముద్రణ కోసం పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వరరావు గురువారం రూ.30వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోత్కూరి మధు మాట్లాడుతూ ఎందరికో చేయూతగా నిలుస్తున్న వెంకటేశ్వర్లు అభినందనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చావా రమేష్‌బాబు, నాగేంద్రబాబు, సిరిపురపు రమణరావు, తాత రాఘవయ్య, మలీదు రమేష్, తాళ్లూరి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లాకు గురువారం ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తాగునీటితో పాటు ఇతర సమస్యలను పరిష్కరించడంతో పాటు డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదలపై చొరవ తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సతీష్, కరుణ్, సాయి, శివ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ తరహాలోనే వేతనం చెల్లించాలి


మాట్లాడుతున్న పార్వతిబాయి

నేలకొండపల్లి: ప్రభుత్వం గ్రామదీపికలను విస్మరించకుండా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సంఘం జిల్లా నాయకులు రాజపుత్ర పార్వతిబాయి కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగుల వేతనాలు పెంచినా, తమను విస్మరించడం సరికాదన్నారు. ఇకనైనా వేతనాలు పెంచుతామని మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన హామీని అమలు చేయడమే కాక, ఏపీ ప్రభుత్వం ఇస్తున్న తరహాలో నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బాజా వనజ, గుత్తికొండ రాణి, బందెల రూప, కూసుపూడి అనిత, శీలం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రైటర్ పద్మభూషణ్
వినోద	వసంత కోకిల
సాయిరాం	అమిగోస్
ఆదిత్య	పఠాన్
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	అమిగోస్

– ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	2
వంకాయ	20		10
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	36	చుక్కకూర	2
బీర	46		10
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	76	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	14	మెంతికూర	5
క్యాలీఫ్లవర్	20		20
ఆలుగడ్డ	24	కొత్తిమీర	1
చామగడ్డ	64		20
క్యారెట్	24	పుదీన	1
క్యాప్సికం	40		20

–ఖమ్మం వ్యవసాయం

ఘనంగా ఏబీవీపీ జిల్లా సమ్మేళనం


శోభాయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఏబీవీపీ జిల్లా సమ్మేళనం గురువారం ఐఎంఏ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రాంత సహ సంఘటన మంత్రి లవన్‌కుమార్ జెండా ఆవిష్కరించారు. అనంతరం విద్యారంగ సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. స్థానిక ఐఎంఏ హాలు నుంచి మయూరిసెంటర్, సిటీ బస్టాండ్, వైరా రోడ్, పాత ఎస్‌బీసీ కార్యాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సతీష్, కార్యసమితి సభ్యుడు బాణోతు శ్రీకాంత్, నగర సహాయ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, యశ్వంత్, కళాశాల ప్రెసిడెంట్ విజయ్, నాయకులు ఉదయ్, చరణ్, కార్తిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై సభ నిర్వహించాలి

నేలకొండపల్లి: స్థానిక మేజర్ పంచాయతీకి కేటాయించిన రూ.10 కోట్ల నిధుల వినియోగంపై గ్రామసభ నిర్వహించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ పాలేరు ఇన్‌చార్జ్ పసుమర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మేజర్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో రాజకీయాలకు తావివ్వకుండా సభలో ఎంపిక చేయాలని కోరారు. అన్ని వార్డులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న సెల్ టవర్‌లు ఆస్తి పన్ను లక్షల రూపాయాల బకాయిలు ఉన్నప్పటికీ వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించని టవర్లను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంలో నిరుపేదలు ఉంటున్న స్థలాలను క్రమబద్ధీకరించి పట్టాలు అందించాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు ఉల్లోజు కర్ణబాబు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు నివాసితులతో కలిసి తహసీల్దార్ మీనన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పేదల స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల చొప్పున చలానాలు చెల్లించాలని అధికారులు నోటీసులు ఇచ్చారని, ఎలాంటి చలానాలు లేకుండా వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గన్యా నాయక్, మురళి, సోమయ్య, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల నాయకులు అరెస్టు

తిరుమలాయపాలెం: హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు వెళ్తున్న ప్రజా సంఘాల నాయకులను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు వెళ్తున్న సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు తుల్లూరి నాగేశ్వరరావు, రావుల వెంకట్రామిరెడ్డి, కొమ్ము నాగేశ్వరరావు తదితరులను అరెస్టు చేశారు.

బడ్జెట్‌పై నిరసన


పత్రాలు దహనం చేస్తున్న రైతులు

నేలకొండపల్లి: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ మండలంలోని చెన్నారంలో రైతులు గురువారం బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. అంతకుముందు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు రచ్చా నరసింహారావు మాట్లాడారు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించడం సరికాదని, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. మదార్, లక్ష్మయ్య, తిరుమలి, కేశవులు, జగన్నాథం పాల్గొన్నారు.

బెల్లం వేణును అరెస్ట్ చేయాలి

కూసుమంచి: దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ సమతను వేధింపులకు గురిచేసి ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడేలా చేసిన బీఆర్ఎస్ నాయకుడు బెల్లం వేణును వెంటనే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొరివి వెంకటరత్నం, మైనార్టీ నాయకులు కలీం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు.

జేఎన్‌టీయూ ఫలితాల్లో ‘ప్రియదర్శిని’ ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

ఖమ్మంరూరల్: జేఎన్‌టీయూ ప్రకటించిన బీటెక్ మొదటి సంవత్సరం ఫలితాల్లో మండలంలోని పెద తండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినుల ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు తెలిపారు. ఫాతిమా, షేక్.లుబిన, ఫర్హోజ్, సయ్యద్ రుక్షాన, జి.పల్లవి, బి.హరిస్మిత, వై.కృష్ణశ్రావణి, ఏ.శ్రేష్ఠ, బి.స్వరూప, బి.సీతలు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా నవీన్‌బాబు మాట్లాడుతూ... కళాశాలలో విద్యార్థులు విద్యతో పాటు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవాలని, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మంచి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థినులను అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

పొంగులేటి విస్తృత పర్యటన


పరామర్శిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. తొలుత బుద్ధారం సర్పంచ్ సామినేని శిరీష వాసు కుమారుడు రిసెప్షన్‌కు హాజరై వధూవరులను ఆశ్వీరదించారు. రువుమాదారంలో ఇటీవల మృతి చెందిన నాగవెల్లి వెంకటరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అభిమానులతో మాటా ముచ్చట కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దినేని బేబీ స్వర్ణకుమారి, కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, నాగవెల్లి తిరుమల రెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.
అదేవిధంగా సామినేని శిరీషవాసు కుమారుడు రిసెప్షన్ వేడుకల్లో వైఎస్సార్‌టీపీ అధినేత్రి వ్యక్తిగత సహాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి హాజరై ఆశీర్వదించారు. ఆయన వెంట పాలేరు అధికార ప్రతినిధి సైదులు, కాసిం, బ్రహ్మం, జిడుగు గోపి పాల్గొన్నారు.
ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి క్రాస్‌రోడ్‌లో ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహానికి మాజీ ఎంపీ పొంగులేటి. శ్రీనివాసరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వస్త్రాలను సమర్పించారు.

మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రసాద్



అసోసియేషన్‌ను అభినందిస్తున్న ఏసీపీ పీవీ గణేష్

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కేఆర్ ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఖమ్మం నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ప్రసాద్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర ఏసీపీ పీవీ గణేష్ పాల్గొని మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మొబైల్ టెక్నీషియన్స్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్ఏకు నివాళి..

రఘునాథపాలెం: మండలంలోని కామంచికల్ వీఆర్ఏ గోపి గురువారం మృతిచెందగా వీఆర్ఏల సంఘం నాయకులు గోపి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపి విధులు నిర్వహిస్తూనే మృతి చెందడం బాధాకరమని నాయకులు అన్నారు. నివాళులర్పించిన వారిలో వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా లింగరాజు, మండలాధ్యక్షుడు వెంకట్, మండల కార్యదర్శి నాగరాజు అన్నారు

సమస్యల పరిష్కారంలో ముందంజ..


మాట్లాడుతున్న మధు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయులపై ప్రభుత్వాలు చూపిన వివక్షకు వ్యతిరేకంగా పీఆర్‌టీయూ ఆవిర్భవించి ప్రభుత్వ ఉపాధ్యాయుల హక్కులు సాధించడంలో ముందంజలో ఉందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోత్కూరి మధు అన్నారు. గురువారం జరిగిన సంఘం ఆవిర్భావ వేడుకల్లో సంఘం జెండాను సీనియర్ నాయకులు సాధు లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ... ఇంక్రిమెంట్లు, ప్రసూతి సెలవులు, చైల్డ్‌కేర్ లీవులు సాధించటంలో తమ సంఘం కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో యలమద్ది వెంకటేశ్వర్లు, విజయ్, అమృత్‌కుమార్, సుమతి, జయమ్మ, హరిత, సైదయ్య, శేఖర్‌రావు, రాయల నర్సింహరావు, వినోద్, సోమ్లా, హుస్సేన్, సర్వర్ మియా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం జరిగేలా కృషి



మాట్లాడుతున్న ఆదినారాయణ

ఖమ్మం సహకారనగర్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవ తీసుకుంటున్నందున, అర్హులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ తెలిపారు. నగరంలోని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్)అనుబంధ డెస్క్ జర్నలిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మాదిరిగానే డెస్క్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలోనూ అండగా ఉంటామన్నారు. అనంతరం డెస్క్ జర్నలిస్టుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రతాపురం శ్రీనివాస్, కార్యదర్శిగా బొమ్మగాని వంశీ తదితరులతో కమిటీ ఎన్నికైంది.

కంటివెలుగు శిబిరాలు ప్రారంభం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని 10, 11వ డివిజన్లలో శిబిరాలను ఆయా డివిజన్ల కార్పొరేటర్లు చావా మాధురి నారాయణరావు, సరిపూడి రమాదేవి సతీష్ ప్రారంభించారు. పదో డివిజన్ శిబిరం ఇందిరానగర్ పాఠశాలలో, 11వ డివిజన్ శిబిరం కవిరాజ్ నగర్ రోడ్డు నంబర్ 15లో సాయిబాబా గుడి దగ్గర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కంటి వెలుగు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాంబాబు, సరిపూడి గోపి సందేష్, వెంకటేశ్వర్లు, స్వర్ణ నాగేశ్వరరావు, తన్నీరు శోభారాణి, నూతలపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఘంటసాల వర్ధంతి


మాట్లాడుతున్న సురేష్

ఖమ్మంగాంధీచౌక్: ఘంటసాల గానామృత సినీ సంగీత విభావరి, సవర సుధ మ్యూజిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యాన ఘంటసాల వెంకటేశ్వరరావు 49వ వర్ధంతిని శనివారం ఖమ్మంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘాల గౌరవ అధ్యక్షుడు పారుపల్లి సురేష్ అధ్యక్షతన ప్రతినిధులు గురువారం సమావేశమై చర్చించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ... శనివారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగే ఘంటసాల వర్ధంతి సభలోనే దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్, నటి జమున, గాయకురాలు వాణీజయరాం సంస్మరణల కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వనం కృష్ణవేణి, కొమర్రాజు మాధవరావు, వీ.వీ.రెడ్డి, పీ.జే.వినయ్‌కుమార్, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు తుమ్మల ఆశీర్వాదం

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెంలో డి.రాంబ్రహ్మం కుమారుడు వివాహానికి గురువారం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల. వెంకటేశ్వరరావు, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మద్ది మల్లారెడ్డి, తేజావత్ పంతులునాయక్, తోట వీరభద్రం, పి.శ్రీను, బండి జగదీష్, ఏ.సుబ్బారావు, పుల్లయ్య, గునిగంటి సురేష్ ఎస్‌కె.సైదులు, జంగం భాస్కర్ పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు కేటాయించాలి

ఖమ్మంరూరల్: అర్హులైన వారందరికీ డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బి.ఉపేంద్ర సాహూ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పోలేపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గతంలో చెప్పిన విధంగా పేదలందరికీ ఇళ్లు ఇవ్వకుండా మోసం చేస్తోందని విమర్శించారు. పోలేపల్లిలో జీ ప్లస్ వన్ విధానంలో 2018లో నిర్మించిన ఇళ్లను ఇంతవరకు ఎవరికీ కేటాయించకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు, బి.ఉపేందర్, మిరియాల నాగరాజు, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు..



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో ప్రజాపంథా నాయకుల అక్రమ అరెస్టు సరికాదని పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రశ్నించే వారిని ప్రభుత్వం సహించలేకపోతోందని విమర్శించారు. అర్ధరాత్రి ఇళ్లకు వచ్చి కుటుంబీకులను బెదిరిస్తూ నాయకులను అరెస్టు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు జి.రామయ్య, ఆవుల అశోక్, సీ.వై.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


అటెన్షన్ ప్లీజ్

ట్రా‘ఫికర్’..!



మండల కేంద్రంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. రింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన తర్వాత తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సెంటర్‌లో ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవటం వలన ఇటీవల లారీ ఢీకొని ఓ వృద్ధురాలు కూడా మృతి చెందింది. వాహనాలు ఇదిగో ఇలా అడ్డదిడ్డంగా నిలపటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– నేలకొండపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : జి.స్రవంతి, ఎస్సై, నేలకొండపల్లి
సెల్ నంబర్ : 87126 59138